క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

మూసాపేట: మూసాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సమితి కన్వీనర్ రమణ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని, సాధారణ చికిత్సలతో పాటు, కంటి, పంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు 'వైటథాన్-2023 రన్'

రాయదుర్గం: పిల్లల్లో కంటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఎల్‌విప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'వైటథాన్-2023 రన్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు హెచ్‌సీయూలో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అంజనీకుమార్ ఈ రన్‌ను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గుల్లపల్లి ఎన్ రావు, ఐసైట్ యూనివర్శల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఐఔ క్యాన్సర్ ఎల్‌విపీఈఐ హెడ్ ఆఫ్ ది ఆపరేషన్ డాక్టర్ స్వాతి కలికి, ఎల్‌విపీఈఐ వైస్ చైర్మన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి, కేఏఆర్ క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ మర్లే ఫెర్నాండజ్ పాల్గొంటారు.

శాంతిసరోవర్‌లో ఎంప్లాయ్ హ్యాపీనెస్ వర్క్‌షాప్

రాయదుర్గం: ఉద్యోగులు పనిలో ఆనందం కోసం చూస్తున్నారని ఎథికా ఇన్సూరెన్స్ బ్రోకర్స్ వ్యవస్థాపకుడు, ఎంప్లాయీ హ్యాపీనెస్ కోచ్ సునీల్ అగర్వాల్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో 'అన్‌లాకింగ్ ది రూటర్స్ ఆన్ హ్యాపీనెస్ ఫర్ ఎవలింగ్ వర్క్ ఫోర్స్' అనే అంశంపై శనివారం రాత్రి ఎంప్లాయీ హ్యాపీనెస్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎథికా ఇన్సూరెన్స్ బ్రోకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ కమ్యూనికేషన్ ఆఫీసర్ కృతిరాజ్ మాట్లాడుతూ సంతోషకరమైన పని వాతావరణాన్ని నెలకొల్పేందుకు ఎటువంటి రుసుము లేకుండానే సంతోషకరమైన వర్క్‌షాప్‌లను అందించడానికి విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, శ్రామికవర్గాలను చేరుకోవాలన్నారు. సగటు వ్యక్తి దాదాపు 90వేల గంటలు పనిలో గడుపుతున్నాడన్నారు. కార్యక్రమంలో పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలపై అవగాహన

శేరిలింగంపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో లక్ష్మీ విహార్ ఫేజ్-2 కాలనీలో అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. సేవ్ వాటర్, సేవ్ ఎనర్జీ, ప్లాస్టిక్ వాడకం వల్లే కలిగే అనర్థాలను వివరించారు. ఇంకుడు గుంతలను పునరుద్ధరించుకోవాలని, వాటి వలన కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రవీంద్ర ప్రసాద్ దూబే, కాలనీ ప్రతినిధులు రాజశేఖర్, రాజు, విద్యాసాగర్, రాంసుబ్బారెడ్డి, శానిటరీ రిసోర్స్ పర్సన్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కింద పడి కార్మికుడి మృతి


రఘునాథ్‌రెడ్డి (ఫైల్)

జీడిమెట్ల: పరిశ్రమలోని గోడపై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి ఓ కార్మికుడు మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ హరీష్ వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్‌నగర్‌కు చెందిన రఘునాథ్‌రెడ్డి(53) గత రెండు రోజులుగా జీడిమెట్ల ఫేజ్-2లోని వీరప్రెసిస్ట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం అతను పరిశ్రమలోని గోడపై నిలబడి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు దీక్షిత్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చింతల్: ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ చెరుకుపల్లి తారాచంద్రారెడ్డి అన్నారు. శనివారం చింతల్ డివిజన్, భగత్ సింగ్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో కోహెన్స్ లైఫ్ సైన్సెస్, జనహిత సేవా ట్రస్ట్, సంఘ సేవకులు ఆదిత్య కోడి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె బీజేపీ మేడ్చల్ జిల్లా అర్బన్ కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తారాచంద్రారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు సుమారు 850 మంది వైద్య పరీక్షలు చేశారు. సూరారం మల్లారెడ్డి ఆసుపత్రి యాజమాన్యం సౌజన్యంతో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఊగుతూ..తూగుతూ

గంజాయి మత్తులో యువత

- పట్టించుకోని పోలీస్ అధికారులు...
- వివిధ రూపాల్లో యథేచ్ఛగా లభిస్తున్న గంజాయి


ధరణినగర్‌లో గంజాయి సేవిస్తున్న యువకులు

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలో యువత గంజాయి మత్తులో తూగుతోంది. గంజాయి దందా కొందరికి కాసులు కురిపిస్తుండగా, దానికి బానిసలుగా మారిన యువకులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఫ్యాషన్‌గా గంజాయిని అలవాటు చేసుకున్న వారు దానికి బానిసలుగా మారుతున్నారు. డివిజన్ పరిధిలోని ఖాళీ స్థలాలు, చెట్ల పొదలు, గుట్టలను ప్రాంతాలను ఎంపిక చేసుకుని సిగరెట్ల రూపంలో గంజాయిని సేవిస్తున్నారు. మత్తులో ఏమి చేస్తున్నారో తెలియక రోడ్డుపైకి వచ్చి చిందులు వేస్తూ కత్తులతో బెదిరింపులకు పాల్పడటమేగాక తమకు తాము గాయలు చేసుకుంటున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి, జగద్గిరి గుట్ట పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి విక్రయాలు జోరుగా జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు.



- కూకట్‌పల్లి సర్కిల్ జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దీనబంధు కాలనీకి చెందిన ఓ యువకుడు గంజాయి మత్తులో బ్లేడ్‌తో గొంతు కోసుకుని స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తూ హల్‌చల్ చేశాడు. అతి కష్టంపై అతడిని పట్టుకున్న స్థానికులు ఆసుపత్రిలో చేర్పించారు. అదే విధంగా దీనబంధు కాలనీకి చెందిన ఓ యువకుడిని మద్యం మత్తులో మరో ముగ్గురు హత్య చేయటం ఇటీవల సంచలనం సృష్టించింది.
- కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని రిక్షాపుల్లర్స్ కాలనీకి చెందిన ఓ విద్యార్థి ఆరు నెలల క్రితం గంజాయి మత్తులో బ్లేడ్‌తో గొంతు కోసుకున్నాడు. తల్లిదండ్రులు అతడిని గాంధీ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు.
- గతంలో ఎల్లమ్మబండ ఎన్‌టీఆర్ నగర్, సిక్కుల కాలనీ ప్రాంతానికి చెందిన పలువురు యువత గంజాయి మత్తులో గొడవలకు దిగి రాడ్లతో కొట్టుకున్న సంఘటనలు చోటు చేసుకున్నాయి.

గంజాయి విక్రయాలు జరిగే ప్రాంతాలివీ..

ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్ సమీపంలోని క్వారీ గుంతలు, కుక్కల ఆసుపత్రి, వాటర్‌ట్యాంక్ ప్రాంతం, రైతుబజార్ ప్రాంతం, సిక్కుల బస్తీని ఆనుకుని ఉన్న చెట్ల పొదలు, ధరణినగర్‌లోని చెట్ల పొదలు, ఎల్లమ్మ చెరువు కట్ట ప్రాంతం, ఎల్లమ్మబండ స్మశాన వాటిక వెనుక వైపు, ఆస్‌బెస్టాస్ కాలనీ హుడా పార్కు, షటిల్ కోర్టు తదితర ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి.

గంజాయికి అడ్డుకట్ట వేయాలి



గంజాయికి బానిసై మా కుటుంబ సభ్యుడు బ్లేడ్‌తో కోసుకుని ప్రాణాల మీదికి తెచ్చుకున్నాడు. సకాలంలో స్పందించకపోతే ప్రాణాలు దక్కేవి కావు. విచ్చల విడిగా గంజాయి విక్రయాలు జరుగుతుండటంతో ఎన్నో కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయి. అధికారులు గంజాయి విక్రయాలకు అడ్డుకట్ట వేయాలి. యువతకు అవగాహన కల్పించి కుటుంబాలు రోడ్డున పడకుండా చర్యలు తీసుకోవాలి.

–చిరుమర్తి రాజు, జగద్గిరిగుట్ట, స్థానికుడు

సమస్యల పరిష్కారానికే పాదయాత్రలు


మాధవినగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తదితరులు

బాలానగర్: ప్రజలను నేరుగా కలిసి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే పాదయాత్రలు చేస్తున్నట్లు బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన దాసరి బస్తీ, బాలానగర్ ఓల్డ్ విలేజ్, కొండిన్య నగర్, డియస్ కాలనీల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ పాదయాత్ర కొనసాగించారు. కార్యక్రమంలో ఏఈ రషీద్, ఎలక్ట్రికల్ ఏఈ అక్బర్, వాటర్‌వర్క్స్ మేనేజర్ అనిల్‌కుమార్, పార్టీ నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫతేనగర్ డివిజన్‌లో..

మాధవినగర్‌లో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ సతీష్ గౌడ్ అధికారులకు సూచించారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇందులో భాగంగా పాదయాత్ర చేస్తూ కాలనీ వాసుల సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన


ఎగ్జిబిషన్‌లో వినియోగదారుల సందడి

భాగ్యనగర్‌కాలనీ: నిజాంపేట్ రోడ్డులోని కొలను నారాయణ రెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వస్త్ర కళా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభిస్తోంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్రాలు, కాటన్‌చీరలు, చేనేత వస్త్రాలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకుడు సింహాద్రి తెలిపారు. చేనేత వస్త్రదారులను ప్రోత్సహించేందుకు ఈ ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. ఎగ్జిబిషన్ ద్వారా కొనుగోలుదారులకు నాణ్యమైన వస్తువులు అందిస్తున్నట్లు తెలిపారు. వివిధ రకాల చేనేత, బెడ్‌షీట్ కవర్లు, బెడ్ షీట్లు, కళాకారులు చేతితో తయారు చేసిన బొమ్మలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు.

ఐడీపీఎల్ రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి


కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండేతో మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: ఐడీపీఎల్ రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండేను కోరారు. శనివారం ఆయన కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐడీపీఎల్ భూ వివాదంపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ ఐడీపీఎల్ సింథటిక్ డ్రగ్స్ యూనిట్‌ను 1962లో హైదరాబాద్ బాలానగర్ ప్రాంతంలో ఏర్పాటు చేశారని, ఇంటర్ మినిస్టీరియల్ కమిటీ నిబంధనల ప్రకారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో ప్రస్తుతం ఈ కంపెనీలో అన్ని విభాగాలను మూసివేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. కొన్నేళ్లుగా ఐడీపీఎల్ కాలనీలో 114 మంది రిటైర్డ్ ఉద్యోగులు నివసిస్తున్నారని, ఉద్యోగులు 2003లో వారి స్థాయిని అనుసరించి కాలనీలో క్వార్టర్స్‌కు డిపాజిట్ కింద రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు చెల్లించినట్లు తెలిపారు. ప్రస్తుతం వారిని టౌన్‌షిప్ కాలనీ నుంచి ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేస్తున్నారన్నారు. వారిపట్ల సహృదయంతో స్పందించాలని కేంద్ర మంత్రిని కోరారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలి


సమావేశంలో పాల్గొన్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కూకట్‌పల్లి: రాష్ట్రంలోని 12 వర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ప్రతినిధుల డిమాండ్ చేశారు. శనివారం జేఎన్‌టీయూహెచ్ విశ్వ విద్యాలయంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన వివిధ వర్సిటీల ప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణలోని 12 విశ్వ విద్యాలయాల్లో పనిచేస్తున్న 1335 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని, జేఎన్‌టీయూహెచ్ విశ్వ విద్యాలయంలో పనిచేస్తున్న 260 మందికి పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సంబంధించిన జీఓ ఎంఎస్ నెంబర్ 11, 141లను పూర్తి స్థాయిలో అమలు పర్చాలని యూనివర్సిటీ అధికారులను కోరారు. సన్నాహక సమావేశంలోనే రెగ్యులరైజేషన్ ప్రక్రియపై పోరాటానికి కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఇందుకుగాను స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో అన్ని అనుబంధ కళాశాలల అసిసెంట్ ప్రొఫెసర్లతో సమావేశం నిర్వహించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని, త్వరలో తేదీలు, కార్యాచరణ ప్రకటించి కార్యక్రమ వివరాలు వెల్లడిస్తామన్నారు.

జూన్ 2న రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

సుభాష్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు టీపీసీసీ జనరల్ సెక్రెటరీ సొంటిరెడ్డి పున్నారెడ్డి తెలిపారు. ఆసక్తిగల వారు జూన్ 1 లోగా వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

సీఎం కప్ విజేతలకు బహుమతుల ప్రదానం

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ పరిధిలో ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించిన సీఎం కప్-2023 విజేతలకు శనివారం మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ బహుమతులు అందజేశారు. ఇందులో భాగంగా నిర్వహించిన మహిళలు, పురుషుల విభాగాల్లో ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు సర్టిఫికెట్లు, కప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజేతలుగా నిలిచిన జట్లను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసి వారి పేర్లను జిల్లా కలెక్టర్‌కు పంపించామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రత్లావత్ గంగయ్య నాయక్ , మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్ రంజిత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ 7వ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో శనివారం శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, కుంభేశ కర్కారికళశ పూజ, నిద్ర కళశ పూజ, శిరస్త్వ హోమం, బింబ శుద్ధి కళశ పూజ, బింబోధరం, బింబ శుద్ధి కళశాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కొలన్ చంద్రశేఖర్ రెడ్డి, నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ సర్పంచ్ ప్రమీల, కార్పొరేటర్లు ప్రణయ యాదవ్, సురేష్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఇంద్ర కుమార్‌దేవ్, ఉంగరాలు శ్రీనివాస్, హరి బాబు, వెంకట్ రెడ్డి, దీపక్, నాయకులు దశరథ్, కుమార్ రెడ్డి, భక్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తా


కేపీహెచ్‌బీకాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శిరీష బాబూరావు తదితరులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలో శనివారం బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీషా బాబూరావు పర్యటించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో టీఆర్‌యస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులపై ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఇప్పటికే బాలాజీనగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులన్నీ పూర్తయ్యాయని, పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి వెంకటేష్ చౌదరి, రంగమోహన్, తిరుపతిరావు, నాగేశ్వరరావు, లక్ష్మీ రాజ్యం, ధనలక్ష్మీ, రాజ్యలక్ష్మి, అరుణ, దినేష్, జాన్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహా, రమణ, సుశీల్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

భట్టి విక్రమార్కకు బాలానగర్ కాంగ్రెస్ నేతల సంఘీభావం


భట్టి విక్రమార్కతో యుగంధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు

బాలానగర్: జడ్చర్ల నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్కను బాలానగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి సంఘీభావం తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో భట్టి విక్రమార్కను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా భట్టి సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, రాహుల్, అరుణ్, నరేష్‌కుమార్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి



మోతీనగర్: రాణా ప్రతాప్ నగర్ బస్తీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. శనివారం ఆమె డివిజన్ పరిధిలోని రాణాప్రతాప్ నగర్‌లో పాదయాత్ర చేశారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్, దోమల సమస్య, పారిశుధ్యం, మంచినీటి లోప్రెషర్ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలన్నిటిని త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీరారెడ్డి, జ్ఞానేశ్వర్, మాధవచారి, లింగం, ఫిరోజ్, శ్యామ్ సుందర్ రెడ్డి, రాజయ్యచారి, పండరీనాథ్, సత్యనారాయణ, శివ, వెంకటేష్, గఫూర్, లక్ష్మీ, నిజాం, గీత తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


కాంగ్రెస్ నాయకులను సన్మానిస్తున్న గొట్టిముక్కల వెంగళరావు తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావును శనివారం కాంగ్రెస్ పార్టీ బాలానగర్ డివిజన్ నూతన ప్రధాన కార్యదర్శి వహాజ్, వైస్ ప్రెసిడెంట్ ముప్పూరి బాలరాజు, మాదారి శ్రీను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని వెంగళరావు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కూకట్‌పలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు బందిగ బాలనర్సింహ, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎం. తిరుపతయ్య యాదవ్, బండారి ప్రవీణ్‌గౌడ్, చోటా మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

సర్దార్‌పటేల్‌నగర్‌లోని శ్రీ లక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవ వేడుకల్లో శనివారం గొట్టిముక్కల వెంగళరావు సతీసమేతంగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇద్దరు పిల్లలతో సహా తండ్రి అదృశ్యం



గంగిరెడ్డి, వెన్నెల, చైతన్య (ఫైల్)

బాలానగర్: కుటుంబ కలహాల కారణంగా ఇద్దరు పిల్లలతో సహా తండ్రి అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ కె. భాస్కర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా, తెల్లగాపల్లె గ్రామానికి చెందిన గంగిరెడ్డి, మమత దంపతులు రాజు కాలనీలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి గంగిరెడ్డి తన మేనమామ గోపితో కలిసి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో మమత భర్తతో గొడవ పడింది. గంగిరెడ్డి భార్యపై చేయి చేసుకోవడంతో ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మనస్తాపానికి లోనైన గంగిరెడ్డి తన కుమార్తె వెన్నెల (10), కుమారుడు చైతన్య (7)లను తీసుకొని మేనమామతో కలిసి ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల బదిలీ

జగద్గిరిగుట్ట: జీహెచ్‌యంసీ వలు సర్కిళ్ల పరిధిలో అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ సూపరిటెండెంట్ పనిచేస్తున్న సునందిని గాజులరామారం సర్కిల్‌కు బదిలీ అయ్యారు. అదే సర్కిల్‌లో సూపరిటెండెంట్ పనిచేస్తున్న గిరిబాబు, గాజులరామారం సర్కిల్ సూపరిటెండెంట్, జవహర్‌లాల్ అదే స్థానాల్లో కొనసాగనున్నారు. అల్వాల్ సూపరిటెండెంట్‌గా పని చేస్తున్న హరిబాబు గాజులరామారం సర్కిల్‌కు, మరో సూపరిటెండెంట్ మంజులత కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఏఎంసీలు కూడా బదిలీ అయ్యారు. యూసుఫ్‌గూడకు చెందిన ఉదయ్ కుమార్ కుత్బుల్లాపూర్‌కు బదిలీ కాగా, గాజులరామారం సర్కిల్ లో పనిచేస్తున్న పి శ్రీనివాస్‌రావ్ అదే స్థానంలో కొనసాగనున్నారు. కె శ్రీనివాస్‌రావ్ ఖైరతాబాద్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు, కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో వెంకటేష్ కార్వాన్‌కు, ప్రమీలా రాథోడ్ మెహదీపట్నంకు బదిలీ అయ్యారు.

'మోడల్ కార్పొరేషన్‌గా నిజాంపేట్'

కుత్బుల్లాపూర్: నిజాంపేట్ కార్పొరేషన్‌ను మోడల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతియాత్ర చేపట్టిన ఆయన నిజాంపేట్ మేయర్ నీలారెడ్డితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. 14వ డివిజన్ పరిధిలోని చైతన్య కాలేజీ నుంచి సిరి ఎన్‌క్లేవ్ కమాన్ వరకు రూ.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, ఆచారి కుంట - బాలాజీ నగర్ పార్క్ వద్ద రూ.25 లక్షలతో నిర్మించిన టాయిలెట్స్, రూ.12 లక్షలతో ఓపెన్ జిమ్, రూ.20 లక్షలతో వెంకట్రాయనగర్ పార్కు వద్ద చేపట్టిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌లను ప్రారంభించారు. 13వ డివిజన్ లోని కాస్టల్ టౌన్ హైస్కూల్ లేన్‌లో రూ.22 లక్షలతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ, శ్రీ జయ ఎంక్లేవ్ రాఘవరెడ్డి కాలనీ వద్ద రూ.15 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీలను ప్రారంభించారు. 14వ డివిజన్ పరిధిలో రూ.50 లక్షలతో స్పోర్ట్స్ కాంప్లెక్స్, విజ్ఞాన్ స్కూల్ నుంచి నిజాంపేట్ మెయిన్ రోడ్డు వరకు రూ.50 లక్షలతో సీసీ రోడ్డు, సిరి ఎన్‌క్లేవ్ లో రూ.25 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కాలనీల్లో ప్రజా అవసరాలకు అనుగుణంగా కోట్ల నిధులు వెచ్చించి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో నిజాంపేట్ కార్పొరేషన్ ను మోడల్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో అధికారులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ప్రారంభం

ప్రగతి నగర్‌లోని హైస్కూల్‌లో గౌతమ్ న్యూరో కేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత న్యూరో మెడికల్ క్యాంప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యూరో మెడికల్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన గౌతమ్ న్యూరో కేర్ అధినేత డా. ఉదయ్ గౌతమ్‌ను అభినందించారు. కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు ,సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ అనుబంధ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.